క్లుప్తంగా

రేపు భువనేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవం


పెద్దాపురంలో భువనేశ్వరి అమ్మవారు

పెద్దాపురం: స్థానిక వర్జుల వారి వీధిలో వేంచేసిన భువనేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు అమ్మవారి పీఠాధిపతులు, లక్ష్మీ జ్యోతిష్య పంచాగకర్త చింతా గోపిశర్మ సిద్ధాంతి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అమ్మవారి జయంతి సందర్భంగా పీఠంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, సహస్ర కుంకుమార్చన, మండపారాధన, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైల్వే స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలి


రైల్వే స్టేషన్ ఆవరణను శుభ్రం చేస్తున్న అధికారులు

సామర్లకోట: రైల్వే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. స్వచ్ఛ భారత్ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం రైల్వే స్టేషన్ ఆవరణను ఆయన ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. సిబ్బంది, ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపై ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లలో మాత్రమే చెత్తను వేయాలని, లేకుంటే రూ.500 వరకు జరిమానా విధిస్తామని ఆయన అన్నారు. ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్.రామకృష్ణ, రైల్వే ఎస్ఎస్ శ్రీధర్, హెల్త్ ఇన్‌స్పెక్టరు కిశోర్, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల మూకుమ్మడి సెలవు

పెద్దాపురం: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 25వ తేదీన నిర్వహించే మహాధర్నాలో పాల్గొనేందుకు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు గురువారం సీడీపీఓ జి.ఉషకు మూకుమ్మడి సెలవు పత్రాలు అందజేశారు. యూనియన్ నాయకులు నాగమణి, ఏస్తేరురాణి మాట్లాడుతూ తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్ల కంటే ఎక్కువ జీతాలిస్తామన్న ప్రభుత్వం వాటిని అమలు చేయడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అమలావతి, పద్మ, కె.దేవి, చంటమ్మ, తులసి, రమణమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం


డ్రైన్‌లోకి దూసుకుపోయిన బస్సు

సామర్లకోట: స్థానిక గాంధీచౌక్‌లో ఒక ప్రైవేటు పాఠశాల బస్సుకు పెను ప్రమాదం తప్పింది. పిఠాపురం రోడ్డు నుంచి పిల్లలను బస్సులో తీసుకు వస్తున్న సమయంలో గాంధీచౌక్ మలుపులో బస్సు అదుపు తప్పింది. దాంతో రోడ్డు మార్జిన్‌లో ఉన్న ప్రధాన మురుగు డ్రైనులోనికి దూసుకువెళ్లి ఒరిగిపోయింది. డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. బస్సులోని విద్యార్థులను మరో బస్సులో తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉందని ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ ఏడీఎస్‌ఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించాలన్నారు.

నేడు స్పందన

కొత్తపల్లి: స్థానిక సురక్ష ప్యాలెస్‌లో శుక్రవారం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించున్నట్లు ఎంపీడీఓ అబ్రహం లింకన్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కృత్తికా శుక్లా, జిల్లాస్థాయి అధికారులు హాజరవుతారని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కొత్తపల్లి: జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు పెనుమల్లు ఆనంద్‌రెడ్డి కోరారు. మండలంలోని కొండెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల ఎస్టీయూ కార్యవర్గ సభ్యులు అత్యవసర సమావేశం నిర్వహించారు. తమ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.లలిత, వి.ఇందిర, రాష్ట్ర పీఆర్సీ కమిటీ కన్వీనర్ యు.శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముంగిట్లో మైకాసురుడు

- చిత్తశుద్ధి లోపంతో పెరుగుతున్న ప్లాస్టిక్ చెత్త
- ప్రకటనలు, తనిఖీలు, హెచ్చరికలతో సరి
- ప్రత్యామ్నాయాలపై కొరవడిన నిబద్ధత
- అవగాహనే తారకమంత్రం అంటున్న విజ్ఞులు


ప్లాస్టిక్ కవరులో సామగ్రి తీసుకు వెళుతున్న డ్రైవరు

సామర్లకోట: ప్లాస్టిక్ నిషేధం అనేది కేవలం ప్రకటనలకు, హెచ్చరికలకు, అడపాదడపా తనిఖీలకు మాత్రమే పరిమితమవుతోంది. జనజీవనంలో మమేకమైపోయిన ఈ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని అధికారులు చిత్తశుద్ధితో.. వినియోగదారులు అవగాహన ఏర్పరచుకోవడం ద్వారా మాత్రమే నివారించడం సాధ్యమవుతుంది. ఏ చిన్న వస్తువును కొనుగోలు చేసినా, ఎక్కడికైనా తీసుకువెళ్లాలన్నా సులువుగా ఉండడం, వర్షానికి తడవకపోవడం, వస్తువు సురక్షితంగా ఉండడం తదితర కారణాలతో పాలిథిన్ క్యారీ బ్యాగ్‌లు, ప్లాస్టిక్ సీసాలు వగైరాలను ప్రజలు వదులుకోలేకపోతున్నారు. కానీ దాని వినియోగం తరువాత పాడేసే ఈ వస్తువు భావి తరాలకు ఎంత చేటు తెస్తుందో వారికి వివరించి చెప్పే యంత్రాంగం, అవగాహన కార్యక్రమాలు ఆ మేరకు సాగట్లేదన్నది నిర్వివాదాంశం. జ్యూట్, పేపర్, గుడ్డ కవర్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నా వస్తువు రక్షణకు అవి సరిపోవడం లేదని వినియోగదారుల అభిప్రాయం. వినియోగించి పడవేసిన ప్లాస్టిక్ అవశేషాలు భూమిలో కలవడానికి వందల ఏళ్లు పడతాయని, తినుబండారాలు, కాగితం పొట్లాలతో కూడిన ప్లాస్టిక్ సంచులను రోడ్లపై పడేస్తే పశువులు వాటిని తిని ఉదర సంబంధ వ్యాధులకు గురై మరణిస్తాయని వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా అధికారులపై ఉంది. అలాగే దుకాణాల్లో తనిఖీలు చేసి, వినియోగదారులపై జరిమానాలు వేసే కంటే అసలు ప్లాస్టిక్ పరికరాల ఉత్పత్తి ఎక్కడ జరుగుతోందన్న విషయం అధికారులకు తెలియనిది కాదు. ఆ ఉత్పత్తి కేంద్రాలను సీజ్ చేయడం, భారీ జరిమానాలు విధించడం తదితర చర్యలు చేపట్టడం ద్వారా మాత్రమే ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమవుతుందని మేధావులు అంటున్నారు.

కొంత మేరకు మార్పు వచ్చింది



ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లో కొంత మార్పు వచ్చింది. చాలా హోటళ్లలో పేపర్ గ్లాసుల్లో టీ, కాఫీలు, దుకాణాల్లో గుడ్డ సంచులు వినియోగదారులకు ఇస్తున్నారు. ప్రజల్లో అవగాహన పెంచి పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధానికి అధికారులు ప్రయత్నం చేయాలి. దీనికి ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి.

– కాళ్ల లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్, సామర్లకోట

అవగాహన పెంచుతాం



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై హోల్‌సేల్ వ్యాపారులకు అవగాహన కలిగిస్తాం. వాటి వల్ల పర్యావరణానికి కలిగే హానిని ప్రజలకు వివరిస్తాం.

–జె.సీతారామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

వచ్చే నెల 2 వరకూ స్వచ్ఛ సేవలు


సామర్లకోట నీలమ్మ చెరువు వద్ద స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో కమిషనర్, కౌన్సిలర్లు

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు స్వచ్ఛతా హీ సేవ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.సీతారామారావు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక నీలమ్మ చెరువు వద్ద ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ముఖ్యమైన కోట్లమ్మ చెరువు, నీలమ్మ చెరువులను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. నీలమ్మ చెరువు అభివృద్ధికి ఇప్పటికే మున్సిపాలిటీ నుంచి రూ.40 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ చెరువు గట్టుపై నిత్యం అనేక మంది మార్నింగ్ వాక్ చేస్తుంటారు. దీంతో కౌన్సిల్ సూచనల మేరకు ఈ గట్టుపై స్వచ్ఛ సేవలు ప్రారంభించామన్నారు. జాతీయ నాయకులు విగ్రహాలు శుభ్రం చేయడం, వార్డుల్లో చెత్తను వాహనాల ద్వారా తొలగించడం చేయనున్నట్టు తెలిపారు. అలాగే మొక్కలు నాటనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రెడ్నం సునీత, స్వయంభారపు వీరభద్రరావు, నేతల హరిబాబు, యార్లగడ్డ జగదీష్, గుబ్బల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి రైతే వెన్నెముక

- బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు గోపు
- ఘనంగా రైతు దినోత్సవం


గోపూజ చేస్తున్న నారాయణమూర్తి, రైతులు

పెద్దాపురం: దేశానికి రైతే వెన్నెముక అని, రైతు లేనిదే అభివృద్ధి సాధ్యపడదని భారతీయ కిసాన్ సంఘ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణ మూర్తి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. బలరాముని జయంతి, రైతు దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం మండలంలోని కాండ్రకోటకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూకాలమ్మ ఆలయం వద్ద రాసంశెట్టి రాజా అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో వారు మాట్లాడుతూ బలరాముడు, నాగలి, గో పూజ విశిష్టత గురించి వివరించారు. అనంతరం కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించి గోపూజ, నాగలి పూజ నిర్వహించారు. తొలుత బలరాముడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, దేవస్థానం చైర్మన్ గవరసాని వీరాస్వామి, గోపు దొరబాబు, గవరసాని రాజశేఖర్, లక్కాకుల కృష్ణ రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వికేంద్రీకరించాలి


సామర్లకోట జగనన్న కాలనీలో పార్కు పనులను పరిశీలించిన నాగనరసింహారావు తదితరులు

సామర్లకోట: జగనన్న కాలనీలో అభివృద్ధి పనులను వికేంద్రీకరించి వేగవంతం చేయాలని కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అన్నారు. గురువారం జగనన్న కాలనీలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కలెక్టరు ఆదేశాల మేరకు కార్పొరేషన్ కమిషనర్ కాలనీలో పార్కుల నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఒకే కాంట్రాక్టరుకు ఎక్కువ పనులు రావడం వలన పనుల జాప్యం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కొన్ని పనులు ఇతర కాంట్రాక్టర్లకు అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, డ్వామా ఏపీడీ వసంతమాధవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు మాధవపట్నం విద్యార్థులు


జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సెలక్షన్ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు

సామర్లకోట: జిల్లా స్థాయి పాఠశాల క్రీడలకు మండల పరిధిలోని మాధవపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ సెలక్షన్ కమిటీ అధ్యక్షుడు యార్లగడ్డ బంగార్రాజు గురువారం రాత్రి స్థానిక విలేకర్లకు తెలిపారు. పెద్దాపురం మహారాణి కళాశాలలో నియోజకవర్గ స్థాయి పోటీలను నిర్వహించారు. వాలీబాల్ అండర్ 17 విభాగంలో డి.రాజేష్, ఖోఖో జట్టుకు వి.నందేశ్వర్, 1500 మీటర్ల పరుగు పోటీకి డి.రాజేష్, అండర్ 14 విభాగం త్రోబాల్‌కు కె.జాన్సన్ ఎంపికయ్యారని తెలిపారు. హెచ్‌ఎం ఎల్.గోవిందు, పీడీ ఎం గోవిందులు విద్యార్థులను అభినందించారు.

ఘనంగా బలరాముడి జయంతి


సమావేశంలో మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు నారాయణమూర్తి

పిఠాపురం: మండలంలోని ఎల్ఎన్ పురంలో గురువారం భారతీయ కిసాన్ సంఘ్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో బలరాముడి జయంతి వేడుకలు నిర్వహించారు. భారతీయ కిసాన్ సంఘ్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత బలరాముని ఆదర్శంగా తీసుకుని వ్యవసాయ రంగం వైపు పయనించాలని కోరారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ కాకినాడ శాఖ నాయకులు రాసంశెట్టి రాజా, గట్టి అశోక్, అన్నం గోపాలరావు, మొండి సత్యనారాయణ, కుంచే నాగేశ్వరరావు, నల్లల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి


కొత్తమూలపేటలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య సూచించారు. మండలంలోని కొత్తమూలపేటలో గురువారం జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి డెంగీ, మలేరియా, హెమగ్లోబిన్, బీపీ పరిక్షలు నిర్వహించి రక్తనమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ వైద్య రంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరిస్తున్నారన్నారు. త్వరలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ అప్పారావు, సీహెచ్‌సీ సరోజినీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కిర్లంపూడి: మండలంలోని ఎరువుల దుకాణాలపై రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్, వ్యవసాయశాఖ అధికారి భార్గవ మహేష్ మాట్లాడుతూ సోమవరం గ్రామంలోని శ్రీదుర్గా నాగలక్ష్మి ఏజెన్సీలో రూ.21,586 విలువ గల 81 యూరియా బస్తాలు వ్యత్యాసం ఉందన్నారు. శ్రీవిజయ దుర్గా ఫెర్టిలేజర్స్ అండ్ జనరల్ స్టోర్స్‌లో రూ.22,000 విలువ గల అమ్మోనియా సల్ఫేట్ అనాధికారంగా నిల్వ ఉంచినట్టు గుర్తించారు. ఈ రెండు షాపుల్లో రూ.43 వేలు విలువ చేసే ఎరువులను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జీవానందం పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి


గురజాడ జయంతి సభలో మాట్లాడుతున్న కృష్ణబాబు


గురజాడ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సాయిరామకృష్ణ

బాల్య వివాహాలు అరికట్టడంలో గురజాడ పాత్ర కీలకం అన్న వక్తలు

పెద్దాపురం: కన్యాశుల్కం తీసుకువచ్చి బాల్య వివాహాలను అరికట్టడంలో గురజాడ వెంకట అప్పారావు పాత్ర అద్వితీయమని సాహితీ స్రవంతి అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు అన్నారు. గురజాడ జయంతిని గురువారం ప్రజా నాట్యమండలి, పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జేఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్ అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణబాబు మాట్లాడుతూ ఆధునిక సాహిత్యానికి వెలుగుబాట చూపించిన వ్యక్తి గురజాడ అన్నారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, కృష్ణబాబు, పీఎస్ఎం నాయకులు ఆర్.వీర్రాజు, మహపాతిన రాంబాబు, డి.సత్యనారాయణ, నేహాలక్ష్మి, సిరిపురపు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో...

పిఠాపురం: గొల్లప్రోలు బాలికల హైస్కూల్‌లో గురువారం మహాకవి గురజాడ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక గొల్లప్రోలు మండల శాఖ ఆధ్వర్యంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కవిగా, సంఘ సంస్కర్తగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. దేశ మంటే మట్టి కాదోయ్.. దేశ మంటే మనుషులోయ్ అని చాటి చెప్పిన మహాకవి గురజాడను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గొల్లప్రోలు మండల శాఖ నాయకులు దాడి పద్మనాభం, ఏలేటి నానిబాబు, సీహెచ్ సూర్యప్రకాశరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురజాడ అడుగుజాడలు అందరికీ ఆదర్శం

సామర్లకోట: తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు కృషి చేసిన సంఘ సంస్కర్త కవి శేఖర గురజాడ అప్పారావు అని, ఆయన అడుగు జాడల్లో సామాజిక చైతన్యం కొరే ప్రతి ఒక్కరూ నడవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం గురజాడ జయంతిని నిర్వహించారు. తెలుగు పండిట్ బి.శ్రీలక్ష్మి గురజాడ రచనలు కన్యాశుల్కం, కన్యక తదితర అంశాలను విద్యార్థులకు వివరించా రు. ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొని గురజాడకు నివాళులు అర్పించారు.

బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పిఠాపురం జైగణేశ్

పిఠాపురం: నియోజకవర్గంలో గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిఠాపురంలో ప్రఖ్యాతిగాంచిన జైగణేష్ ఆలయంలో స్వామివారి రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

హైవేపై ఎమ్మార్పీఎస్ నేతల ఆందోళన


జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పిఠాపురం: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం గొల్లప్రోలు మండలం వన్నెపూడి సమీపంలో జాతీయ రహదారిని నిర్బంధించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు తొమ్మండ్ర హేమంత్, మధు, పలివెల నవీన్ తదితరులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి నాయకులతో చర్చించడంతో ఆందోళన విరమించారు.

పశువుల పాక దగ్ధం

జగ్గంపేట: మండలంలోని వెంగాయ్యమ్మపురంలో గురువారం పశువుల పాక, గడ్డివాము దగ్ధమయ్యాయి. అప్పన్న పెదకాపుకు చెందిన పశువుల పాక పరిసరాల్లో అజాగ్రత్తగా పొగ తాగడంతో ఈ ప్రమాదం జరిగినట్టు జగ్గంపేట అగ్నిమాపక అధికారి ఎస్.లక్ష్మణరావు తెలిపారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ


గంగంపాలెంలో ఉపాధి పనుల అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న అంబుడ్స్‌మెన్ జ్యోతి

గోకవరం: మండలంలోని గంగంపాలెంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదుపై అంబుడ్స్‌మెన్ ఎం.జ్యోతి గురువారం విచారణ నిర్వహించారు. గ్రామంలోని చెరువు పనుల్లో 67 మందికి దొంగ మస్తర్లు వేసి అవకతవకలకు పాల్పడ్డారని ఇటీవల జరిగిన సోషల్ ఆడిట్‌లో పలువురు గ్రామస్తులు డ్వామా పీడీ పి.జగదాంబకు ఫిర్యాదు చేశారు. దీనిపై డ్వామా పీడీ విచారణకు ఆదేశించగా అంబుడ్స్‌మెన్ విచారణ చేపట్టారు. ఉపాధి కూలీలను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా అంబుడ్స్‌మెన్ జ్యోతి మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహిస్తున్నామన్నారు. విచారణ ఇంకా పూర్తికాలేదని, చెరువులో చేపట్టిన ఉపాధి పనులపై సాంకేతికపరంగా కూడా విచారణ నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఉపాధి ఏపీఓ శేషఅప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మూషిక వాహనుడిగా దర్శనమిచ్చిన వినాయకుడు


రత్నగిరిపై మూషికవాహనుడి అలంకరణలో వినాయకుడు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం స్వామివారి మూషిక వాహనుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు ఉదయం స్వామివారికి పుష్పాలు, గరికతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం వైదిక కార్యక్రమాల సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం

ప్రత్తిపాడు: వినాయక చవితికి ప్రతిష్ఠించిన గణనాథుడు మూడు రోజుల పాటు పూజలందుకుని నిమజ్జనానికి తరలివెళ్లారు. స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశ్ విగ్రహాన్ని గురువారం నిమజ్జనం చేశారు. మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి లంపకలోవ రహదారిలోని పుష్కర కాలువలో నిమజ్జనం చేశారు.